బోసిపోయిన ఆర్డీవో కార్యాలయం

ప్రారంభమై 85 రోజులు గడుస్తున్నా..
విధుల్లో ఒకే ఒక్కరు

రామాయంపేట(మెదక్): పట్టణంలో రెవెన్యూ డివిజన్ కార్యాలయం మున్నాళ్ల ముచ్చటగా మారింది. అధికారికంగా 85 రోజుల (అక్టోబర్ 2న) క్రితం ఇక్కడ కార్యాలయం ప్రారంభించారు. కానీ ఇంత వరకు జూనియర్ అసిస్టెంట్‌ను తప్పించి ఆర్డీవో, ఇతర సిబ్బంది నియామకాలు కాలేదు. మెదక్ ఆర్డీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రజల నెలల తరబడి చేపట్టిన దీక్షల ఫలితంగా రామాయంపేటకు ఆర్డీవో కార్యాలయం మంజూరైంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అక్టోబర్ రెండున కార్యాలయం ప్రారంభించారు. డివిజన్ పరిధిలో రామాయంపేట, నిజాంపేట,


రామాయంపేటలో ఆర్డీవో కార్యాలయం

నార్సింగి, చిన్నశంకరంపేట మండలాలను చేర్చారు. కానీ సిబ్బంది నియామకాన్ని పట్టించుకోలేదు.


విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్

ఫర్నిచర్ మంజూరు కాలేదు

కార్యాలయం ప్రారంభమై 85 రోజులు గడుస్తున్నా.. కంప్యూటర్లు, పూర్తిస్థాయిలో ఫర్నిచర్ మంజూరు కాలేదు. వీఆర్‌ఏ నుంచి పదోన్నతి పొందిన ఈశ్వరమ్మను కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్న రికార్డు అసిస్టెంట్ వారంలో మూడు రోజులు తూప్రాన్ మరో మూడు రోజులు రామాయంపేటలో విధులు నిర్వర్తిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న అటెండర్ తాత్కాలికంగా ఆర్డీవో కార్యాలయంలో నియమించారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలు తమ


ఆర్డీఓ, ఇతర సిబ్బంది లేక ఖాళీగా కుర్చీలు

పనులు కాకపోవడంతో గతంలో మాదిరిగానే మెదక్ ఆర్డీవో కార్యాలయానికి వెళ్తున్నారు. రామాయంపేటలో ఆర్డీవో కార్యాలయం ఉన్నా.. తమకు ఇబ్బందులు తప్పడంలేదని రైతులు వాపోతున్నారు.

సిబ్బందిని నియమిస్తాం

రామాయంపేటకు ఆర్డీఓ కార్యాలయం మంజూరైనా సిబ్బంది నియామకానికి ఆదేశాలు రాలేదు. క్యాడర్ స్ట్రెంత్ నియామకానికిగాను జీవో రాగానే సిబ్బందిని నియమిస్తాం.

– రమేశ్, అదనపు కలెక్టర్, మెదక్

నేటి నుంచి ప్రజాపాలన

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి ప్రజాపాలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భారతి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి తెలిపారు. గురువారం ఉదయం టిక్యాదెవమ్మగూడం, బీమ్లా పంచాయతీల్లో మధ్యాహ్నం నుంచి ఉసిరికపల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అభయహస్తం ప్రజాపాలన పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందుకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల్లో ఏర్పాట్లు చేశామన్నారు.

ఏర్పాట్లు పూర్తి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో గురువారం నుంచి జనవరి 6 వరకు నిర్వహించే ప్రజాపాలనకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ పేర్కొన్నారు. మొదటిరోజు వెల్దుర్తి మండలంలో మానెపల్లి, అందుగులపల్లి, హస్తాల్‌పూర్, మెల్లూర్‌తో పాటు మాసాయిపేట మండలంలో హకింపేట, అచ్చంపేట, కొప్పులపల్లి, నాగ్సాన్‌పల్లి గ్రామాల్లో ప్రజాపాలనలో ప్రభుత్వ పథకాల దరఖాస్తులు తీసుకుంటామన్నారు.

గ్రామసభలకు నాయకులు సహకరించాలి

చేగుంట(తూప్రాన్): ప్రజాపాలన గ్రామ సభలను విజయవంతం చేసేందుకు యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల అమలు కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనాలన్నారు. ప్రజలకు అధికారులకు సమన్వయ కర్తలుగా పనిచేసి గ్రామ సభలను విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా అయ్యప్ప మండల పూజ

పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: వేద పండితుల మంత్రోచ్చారణ.. అయ్యప్ప స్వాముల శరణు ఘోష నడుమ అయ్యప్ప మండల పూజ బుధవారం మెదక్‌లో ఘనంగా జరిగింది. స్థానిక అయ్యప్ప దేవాలయంలో ఉదయం సుప్రభాత సేవ, గణేశ్, సుబ్రహ్మణ్య స్వామి పూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గురుస్వాములు హరిదాస్, వైద్య రాజు వేద మంత్రాలు పఠించారు. ఈ సందర్భంగా గుండు రమేశ్‌స్వామి సన్నిధానం స్వాములు వేలం పాటలో రూ.56 వేలకు పడి వెలిగించడం దక్కించుకున్నారు. అనంతరం వారు పడి వెలిగించారు. మాజీ మంత్రిహరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్ల స్వామిని దర్శించుకున్నారు. గురుస్వామి


పూజలో మాజీ మంత్రి హరీశ్‌రావు

వైద్యరాజు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం గీతం విద్యా సంస్థల చైర్మన్ రామాంజనేయులు అన్నదానం నిర్వహించారు. ఆలయ పూజారి అశోక్, గురు స్వాములు గంగ లక్ష్మీపతి, శంకర్, శ్రీకాంత్ రెడ్డి, రమేశ్, కొండ శ్రీను, పురం వెంకట్ నారాయణ, వీర్ కుమార్, పార్థివనాథ్, శ్రీధర్, రాధాకృష్ణ, సత్యనారాయణ, ఆలయ బాధ్యులు చక్రపాణి, ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి సహకారం


అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పట్టణంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. ఆలయంలో బుధవారం నిర్వహించిన మహా పడిపూజలో ఆమె హాజరై.. అయ్యప్పస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం చేపట్టగానే తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఆలయం చుట్టూ అటవీ ప్రాంతం, పక్కన చెరువుతో కూడిన పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువిరుస్తుందని చెప్పారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గురుస్వామి అశోక్‌గౌడ్‌తో పాటు పలువురు గురుస్వాములు, అయ్యప్పస్వామి మాలధారులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లికార్జునస్వామి జాతర


రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్ మల్లికార్జున స్వామి ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గ్రామంలో భక్తిశ్రద్ధలతో రథాన్ని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో రథోత్సవం కనుల పండువగా సాగింది. బుధవారం ఉదయం పాచిబండ్లను ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఉత్సవాలు విజయవంతం చేసేందుకు సహకరించిన గ్రామ పెద్దలకు, యువకులకు సర్పంచ్ యాదయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

‘చలో పార్లమెంట్’ను జయప్రదం చేయాలి

నర్సాపూర్: జనవరి 12న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ కోరారు. చలో పార్లమెంట్ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. అందరికి ఉచిత విద్య అవకాశంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మహేందర్, రవి, కిరణ్, రాజు, బాలరాజు, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

నర్సాపూర్: మండలంలోని అచ్చంపేటలో దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు సంజీవులు, భిక్షపతి, నాగరాజు, రాంచందర్ తదితరులు బుధవారం ఎస్‌ఐ శివకుమార్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కేసు నమోదు చేయని పక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వారి వెంట సంఘాల నాయకులు రమేష్, ఆంజనేయులు, ప్రభాకర్, శ్రీకాంత్, నర్సింలు, మధు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గ్రామ దేవతలకు పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో గ్రామ దేవతలకు పూజా మహోత్సవాలు బుధవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. బొడ్రాయి పత్రిష్ఠతో పాటు పోత లింగమయ్య విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామంలోని దేవతమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఉన్నారు.

మంచినీటి కోసం బోరు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని శాలిపేట మధిర గ్రామమైన రామాయపల్లిలో మండల పరిషత్ నిధులతో మంచినీటి కోసం ఎంపీపీ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్ బోరు వేశారు. బుధవారం సర్పంచ్ పోచయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు శివకుమార్, నాయకులున్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

- నోడల్ అధికారి విశ్వనాథం
- ఎల్లంపల్లి పాఠశాల తనిఖీ

టేక్మాల్(మెదక్): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి విశ్వనాథం అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లంపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని పలు రికార్డులు, లైబ్రరీ, వర్క్‌షీట్స్, లెస్సన్‌ప్లాన్‌లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు అలైన్‌మెంట్ అనుసరించాలని తెలిపారు. పాఠశాలలో నిర్వహించే లైబ్రరీ నిర్వహణలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు బొమ్మలతో కూడిన విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులు గైర్హాజర్ కాకుండా చూసుకుంటూ ప్రతీ నెల తప్పనిసరిగా పోషకుల సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. పాఠశాల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయురాలు జరీనా ఉన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి

నేడు టి.లింగంపల్లికి మంత్రి దామోదర రాక

రేగోడ్(మెదక్): మండలంలోని టి.లింగంపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నట్లు పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి బుధవారం తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు అయ్యప్పస్వామి మండల పూజ

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద గురువారం అయ్యప్పస్వామి మండల పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మైనంపల్లి రంగారావు, గంగా నరేందర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే మండల పూజలో అయ్యప్పస్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మెదక్ కలెక్టరేట్: మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు గురువారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నారు. ముందుగా పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

నర్సాపూర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన పారదర్శకంగా ఉంటుందని, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందుతాయని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు అమలు చేసేందుకు ఈనెల 28 నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న ప్రజాపాలన గ్రామ సభల్లో ప్రజలు తమ సమస్యలను అధికారులు ఇచ్చే దరఖాస్తులను నింపి వారికి అందజేయాలన్నారు. ఆయా పథకాలకు ప్రభుత్వం అర్హులను ఎంపిక చేసి పథకాలు అందచేస్తుందని చెప్పారు. జిల్లాలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజాపాలన ద్వారా ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దరఖాస్తు చేయాలనుకునే


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

వ్యక్తులు తమ ఆధార్ కార్డు జిరాక్స్, రైతులు తమ పొలాల పాస్ పుస్తకం జిరాక్స్‌తో పాటు ఒక ఫొటో దరఖాస్తు ఫారంకు జతచేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి, పార్టీ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, శివకుమార్, ఉదయ్‌కుమార్, సురేశ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయోధ్య అక్షింతల శోభయాత్ర

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో అయోధ్య శ్రీరామతీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాముల వారి అక్షింతల కలశాల శోభయాత్ర వైభవంగా నిర్వహించారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలోని శబరిమాత ఆలయం నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకు జరిగిన శోభయాత్ర కనులవిందుగా సాగింది. ఈ సందర్భంగా శ్రీరామతీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు వెంకటేశం, ఆంజనేయులు మాట్లాడుతూ.. అయోధ్య నుంచి శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించిన అక్షింతలు ఈ నెల జనవరి 15 వరకు ఇంటింటికి చేర్చాల్సిన బాధ్యత రామభక్తులదేనన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి సర్పంచ్ అశోక్‌గుప్తా, ఉపసర్పంచ్ కాలేరు యోగి, శ్రీరామతీర్థ ట్రస్ట్ సభ్యులు


అక్షింతల శోభయాత్రలో శ్రీరామ భక్తులు

బాల్‌రెడ్డి, లింగారెడ్డి, నరేశ్, మలేశం, నాగరాజు, ప్రవీణ్, నరేశ్‌నాయక్, ప్రవీణ్, శ్రీరామ్, శేఖర్‌రెడ్డి, నిహంత్‌రెడ్డి, నర్సింలు, సత్యం, రూప, సునీత, రమ, అనిత, భాగ్యలక్ష్మి, వాణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

చేగుంట(తూప్రాన్): పర్యావరణ పరిరక్షణ అవగాహణ కోసం సైకిల్‌యాత్ర చేస్తున్నట్లు రూబెన్‌సింగ్ అన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పర్యావరణ పరిరక్షణ కోసం రూబెన్‌సింగ్ నిర్వహిస్తున్న సైకిల్‌యాత్ర బుధవారం సాయంత్రం చేగుంటకు చేరుకుంది. చేగుంటలో బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ వీహెచ్‌పీ కార్యవాహ సురేశ్ అతనికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూబెన్‌సింగ్ మాట్లాడుతూ.. ఉత్తర్‌ప్రదేశ్ ఇటావ జిల్లా సెక్కర్‌నగర్‌కు చెందిన తాను పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలని అవగాహన కల్పిస్తూ దేశ వ్యాప్త సైకిల్ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి 2600 కిలోమీటర్లు సైకిల్‌యాత్ర చేసినట్లు చెప్పారు.


సైకిల్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

మున్సిపాలిటీలో ప్రజాపాలనపై సమీక్ష

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన కార్యక్రమంపై మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రతి వార్డులో ప్రజాపాలనపై కౌన్సిలర్లు ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. ప్రభుత్వ పథకాలతో నిరుపేదలకు లబ్ధి చేకూరాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి మాట్లాడుతూ.. వార్డుల్లో జరిగే సమావేశాల్లో ముందుగా సీఎం సందేశాన్ని చదివి వినిపించాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి జిరాక్స్ ప్రతులను వినియోగించవద్దన్నారు. ఇంతకుముందే పింఛన్ పొందుతున్న వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవద్దని, కొత్తవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్‌తో పాటు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామీణ ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని రాయిలాపూర్, పీర్యతండాలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర (వీబీఎస్‌వై) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర డ్వాక్రా సంఘాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. మహిళల అభివృద్ధి, స్వయం ఉపాధికి రుణాలు అందిస్తున్నామన్నారు. అనంతరం నోడల్ అధికారి, ఎస్‌బీఐ మేనేజర్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ.. పంటల సాగుకోసం రుణాలు మంజూరు చేసుందన్నారు. స్వయం ఉపాధికోసం ముద్ర రుణాలు ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. దీంతో పాటు వ్యవసాయశాఖ, ఐసీడీఎస్, ఉపాధిహామీ పథకం ఇతర శాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు రాకేశ్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమేశ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీఎం సంగమేశ్వర్

సంక్షిప్త వార్తలు

◆ వ్యక్తి అదృశ్యం


కవిత(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని స్కూల్ తండాకు చెందిన కెతావత్ కవిత కనిపించడం లేదని భర్త బాబ్యు హవేళిఘణాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్కూల్ తండాకు చెందిన కవిత ఈ నెల 24న కూలీ పని చేసుకునేందుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లగా ఇంత వరకు ఇంటికి తిరిగి రాలేదన్నారు. ఎవరైనా అచూకీ లభిస్తే హవేళిఘణాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

◆ నేడు రామాయంపేటలో మండల సమావేశం

రామాయంపేట(మెదక్): పట్టణంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉమాదేవి పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. మండల స్థాయి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు ఈసమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

◆ పరీక్ష సామగ్రి అందజేత

పాపన్నపేట(మెదక్): మండలంలోని చీకోడ్ లింగాయిపల్లి గ్రామాల్లో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్లు అందించారు. దాత విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ఈకేవైసీ తిప్పలు..



కౌడిపల్లి(నర్సాపూర్): గ్యాస్ కోసం ఈకేవైసీ చేసేందుకు మహిళలకు తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రం కౌడిపల్లి హెచ్‌పీ గ్యాస్ ఎజెన్సీ వద్దకు ఈకేవైసీ చేసుకునేందుకు మహిళలు పక్షం రోజులుగా తరలి వస్తున్నారు. జనం ఎక్కువగా వస్తుండటంతో రోజంతా ఇక్కడే వరుసలో ఉంటున్నారు. దీంతో చేసేదిలేక ఇతర గ్రామాల నుంచి వచ్చే మహిళలు ఇంటి నుంచి టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుని ఇక్కడే తింటున్నారు.

◆ విద్యుత్ లోపంతో కంప్యూటర్‌లు దహనం

పాపన్నపేట(మెదక్): విద్యుత్ హెచ్చుతగ్గులతో ప్రభుత్వ కార్యాలయంలోని కంప్యూటర్‌లు దహనం అయ్యాయని అధికారులు పేర్కొన్నారు. కొద్ది రోజులుగా విద్యుత్ సరఫరాతో ఇబ్బందులు వస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయంలో పలు కంప్యూటర్‌లు పాడైనట్లు పలు శాఖల అధికారులు తెలిపారు. ఈ విషయంలో విద్యుత్ శాఖ అధికారులను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా.. అధికారులు స్పందించక పోవటం గమనార్హం.

◆ బి.తిమ్మాయిపల్లి పాఠశాల తనిఖీ



హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని బి.తిమ్మాయిపల్లి పాఠశాలను జిల్లా మండల విద్యాధికారి నీలకంఠం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యాబోధన, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు సమయపాలన ప్రకారం పాఠాలు బోధించి, నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల రిజిష్టార్‌ను పరిశీలించారు. హెచ్‌ఎం ప్రమోద్‌కుమార్, దయానందం, మహేశ్వర్ ఉన్నారు.

◆ పాత సర్పంచ్‌లే కొనసాగించాలి



మనోహరాబాద్(తూప్రాన్): కొత్త సర్పంచ్‌లు ఎన్నికయ్యే వరకు గడువు ముగిసినా.. పాత సర్పంచ్‌లే కొనసాగించాలని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు మల్లేశ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం రాకతో సర్పంచ్‌ల ఎన్నికల గడువు ముగిసినా.. ఎన్నికలు ఆలస్యం కానుండటంతో తాజా సర్పంచ్‌లనే కొనసాగించాలని, కరోనా రావడంతో పాలన పరంగా సర్పంచులకు ఇబ్బందులు కలుగాయని, అందు కోసమే అధికారుల పాలన కాకుండా సర్పంచ్‌లకే బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగభూషణం, నర్సయ్య, నాయకులు భిక్షపతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉచిత వైద్య శిబిరం



తూప్రాన్: మండలంలోని నర్సంపల్లి గ్రామంలో బుధవారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, గొంతు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భసంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తులు తదితర సమస్యలు పరిశీలించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య బృందం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, వైద్యులు సందీప్, చక్రవర్తి, శేఖర్, సిబ్బంది మహేశ్వరీ, సుధాకర్, బాలకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.